విద్యుత్ భారాలు తగ్గించాలి-స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలి

సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: విద్యుత్ భారాలు తగ్గించాలి, స్మార్ట్ మీటర్లు నిలుపువేయాలి అనే ప్రధాన డిమాండ్లతో ఈనెల 27 జరిగే ధర్నాలో ప్రజలందరూ విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి గడిచినా విద్యుత్ చార్జీలు భారీగా ప్రతినెల పెరిగిపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కుని విద్యుత్ దోపిడీ సాగిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, 200 యూనిట్లు వరకు అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని వైసిపి మాట ఇచ్చి నమ్మకద్రోహం చేసిందని మండిపడ్డారు. తక్షణం విద్యుత్ భారాలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని, ప్రైవేటీకరణ ఆపాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.

పరదేశినాయుడుపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు పెదగంట్యాడ కాలనీ, నెల్లిముక్కు గ్రామానికి చెందిన యేల్లేటి పెంటమ్మ ఆర్ కార్డు నెంబర్ 229ను అక్రమంగా మార్చుకొని స్టీల్‌ప్లాంట్‌లో అధికారిగా విధులు నిర్వహిస్తున్న గండేపల్లి పరదేశి నాయుడుపై తక్షణమే చర్యలు తీసుకుని విధుల నుంచి సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం పెదగంట్యాడ సిపిఐ పార్టీ కార్యాలయంలో గాజువాక నియోజక వర్గ కార్యదర్శులు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం నుండి సీపీఐ పార్టీలో యేల్లేటి పెంటమ్మ కుటుంబ సభ్యులు పనిచేస్తున్నారని, వీరి కుటుంబానికి సంబంధం లేని వ్యక్తి కూతురు కొడుకు అని యేల్లేటి పెంటమ్మ మనుమడిగా తప్పుడు పత్రాలు సృష్టించి ఉక్కులో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న పరదేశి నాయుడును కఠినంగా శిక్షంచాలన్నారు. ఇప్పటికే యేల్లేటి దేముడు కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులకు, స్టీలు ప్లాంట్ సీఎండికి ఫిర్యాదు చేసారని, ఈ దొంగ మనుమడు పుట్టిన తేదిని 4 సంవత్సరాలు తగ్గించుకొని తప్పుడు ధ్రువ పత్రాలతో స్టీలు ప్లాంట్ యాజమాన్యాన్ని మోసం చేసి ఉద్యోగం పొందాడన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం వర్గం సిపిఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, పల్లెటి పోలయ్య, సిపిఐ ఏరియా కార్యదర్శులు జి.ఆనంద్, తాండ్ర కనకరాజు, కె.అచ్యుత రావు, ఎ.విష్ణు మూర్తి, యేల్లేటి శ్రీనివాసరావు, రాజబాబు, వి.దుర్గారావు, కారి పోతయ్య, సోమేశ్, నందన్న మహిళ నాయకురాలు కె.వనజాక్షి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఈనెల 27న విశాఖ నగరం సీతమ్మధారలో గల ఏపీఈపీడీసీఎల్ కేంద్రం వద్ద వామపక్ష పార్టీలు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి నాంది పలుకుతూ మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పిలుపునిచ్చారు. గాజువాక నియోజకవర్గ సీపీఐ సమావేశం పెదగంట్యాడ సీపీఐ పోతిన సన్యాసిరావు భవనంలో ఎంఎస్ అప్పారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పైడిరాజు

మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు ఏడు సార్లు పెంచి ప్రజలపై రూ.50 వేల కోట్ల భారం వేశారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో కసిరెడ్డి సత్యనారాయణ, యేల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, తాండ్ర కనకరాజు పల్లెటి పోలయ్య, రాజబాబు, వై.నందన్న, సాంబమూర్తి విష్ణుమూర్తి, వనజాక్షి, పిల్ల సూర్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఏబీ బర్ధన్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర - మల్కాపురం: భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి కార్యదర్శి కామ్రేడ్ ఏబీ బర్ధన్ శతజయంతి సందర్భంగా మల్కాపురం గ్రామ మండలిలో బర్ధన్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కె.సత్యాంజనేయ పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. బర్ధన్ చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఆయన నిరంతరం ప్రజల పక్షాన ఉండి కార్యక్రమాలు చేసిన మహానుభావుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం సహాయ కార్యదర్శి జి.రాంబాబు, గండ అప్పారావు, పోతిన రాము, ఎన్వి త్రినాథ్, ఎస్.గోపాల్‌రావు, కనకరాజు, ఎన్వి రమణ తదితరులు పాల్గొన్నారు.

956వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు దీక్షలు 956వ రోజుకు చేరుకున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి ఇనుస్ట్రుమెంటేషన్, క్యూ ఏటీడీ, టెలికం, డిఎన్‌డబ్ల్యూ, ఆర్ అండ్ డి విభాగాల ప్రతినిధులు కార్మికులు పాల్గొన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధి ఎం.రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో గతంలో ఉన్న నమ్మకం సన్నగిల్లిందని అన్నారు. దేశంలో జరిగిన అనేక ఉప, స్థానిక ఎన్నికల్లో నిరూపితమైందని ఆయన వివరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు చౌకగా అందిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడుతున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధి వై.మస్తానప్ప, కె.శ్రీనివాస్ రెడ్డి, శివ, చిరంజీవి, కె.అప్పారావు, సూరిబాబు, కె.రామచంద్రరావు, సత్యారావు, ఎన్ శ్రీనివాస్ రెడ్డి, చీకటి శ్రీను, భానుమూర్తి, కె.నాగేశ్వరరావు, సురేష్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల అక్రమ అరెస్టులను ఖండించండి

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జరగనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా, నియంతృత్వంతో వ్యవహరిస్తూ ఆదివారం నుండే అన్ని జిల్లాల్లో నాయకులను అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడాన్ని ఏఐటీయూసీ విశాఖ జిల్లా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మన్మధరావు, జి.ఎస్.జె.అచ్యుత రావు తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా విజయవాడలో నిరసన తెలియజేస్తుంటే పోలీసులను ఉపయోగించి అత్యంత దారుణంగా, దుర్మార్గంగా అరెస్టులకు పూనుకోవడం, కార్యక్రమాన్ని భగ్నం చేయడం దారుణమని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌టీఎస్ రోడ్డు పనులకు కొలతలు

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ బీఆర్టీఎస్ రోడ్ నిర్మాణం పనులకు సంబంధించి సోమవారం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డ్ కార్పొరేటర్ పివి స్థానికులతో కలసి కొలతలు ప్రారంభించారు. గడచిన 15 ఏళ్లగా పాత అడవివరం కూడలి నుండి పాత గోశాల వరకు ఆగిపోయిన బీఆర్టీఎస్ రోడ్ పనులు తిరిగి ప్రారంభమైనందుకు స్థానికులు ఆనందపడుతున్నారు. అయితే ఉన్న ప్రధాన రహదారి నుండి ఇరు ప్రక్కల 50 అడుగులు కొలతలు తీసుకోవాలని కొంతమంది స్థానికులు అంటున్నారు.

సర్క్యులర్ స్టాటిస్టిక్స్‌పై గీతం జాతీయ వర్క్‌షాప్

విశాలాంధ్ర - మధురవాడ: ప్రముఖ గణాంక శాస్త్రవేత్త ప్రొఫెసర్ సి.ఆర్.రావు స్మారకంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం సర్క్యులర్ స్టాటిస్టిక్స్ మరియు బిగ్‌డేటా రంగాలలో నూతన ఆవిష్కరణలపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం ముఖ్యఅతిథిగా హాజరై గణిత మరియు గణాంక శాస్త్రాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు. భారతీయులు గణితశాస్త్రంతో పాటు గణాంక శాస్త్రంలో అత్యున్నత పరిశోధనలు జరిపారని ప్రొఫెసర్ సి.ఆర్.రావు వంటి వారు ఆధునిక శాస్త్రాలతో గణాంక శాస్త్రాన్ని కలిపి అద్భుత ఫలితాలు సాధించి ప్రపంచానికి మార్గం చూపారని కొనియాడారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్. కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, గణితశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ శిరీష, నిర్వాహక కార్యదర్శులు డాక్టర్ ఎ.శ్రీదర్, డాక్టర్ జోగారావు, డాక్టర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం స్టాటిస్టిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎస్.రావు జమ్మలమడక కీలక ఉపన్యాసం చేయగా వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్‌లుగా హాజరైన ఆంధ్రవిశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు "డేటా మైనింగ్ అండ్ బిగ్‌డేటా" అనే అంశంపై ప్రసంగించగా, సి.ఎస్.ఐ.ఆర్. శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఆశిష్‌సేన్ గుప్తా సర్క్యులర్ స్టాటిస్టిక్స్ ప్రయోజనాలను వివరించారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయం స్టాటిస్టిక్స్ విభాగం అధిపతి డాక్టర్ వి.ఎస్.విద్యానాధన్, డాక్టర్ విష్ణువర్ధన్‌లు అప్లైడ్ స్టాటిస్టిక్స్ ఉపకరణాల గూర్చి వివరించారు. ఈ వర్క్‌షాప్‌నకు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి గణిత మరియు గణాంక శాస్త్ర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుల అరెస్టులు దుర్మార్గం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: విజయవాడలో సోమవారం జరిగే మధ్యాహ్న భోజన వర్కర్ల మహాధర్నాకు హాజరు కాకుండా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు రాష్ట్ర నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం దుర్మార్గమని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎస్.భద్రం, రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ్, జిల్లా నాయకులు వియ్యపు రాజులు తీవ్రంగా ఖండించారు. ముందస్తు, అక్రమ అరెస్టుల ద్వారా ఉద్యమాలు ఆపలేరని రానున్న ఎన్నికల్లో కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని భద్రం హెచ్చరించారు. ఏఐటియుసి జిల్లా నాయకులు వియ్యపు రాజును పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయం

విశాలాంధ్ర - జి.మాడుగుల: రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమెలి చిట్టిబాబు అన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన చంద్రబాబు మచ్చలేని చంద్రుడులా బయటకు వస్తారన్నారు. టీడీపీ గెలుపు ఖాయమని టీడీపీ వస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అప్పలరాజు, సర్పంచ్ కృష్ణ మూర్తి, చిన్న కొండబాబు, మండల ఉపాధ్యక్షులు పాటి బింబాబు, సర్పంచ్ గంతం దొర, లక్ష్మణ్ రావు, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి లకే రామకృష్ణ, క్లస్టర్ ఇంచార్జిలు వంజరి చిరంజీవినాయుడు, సోమేలి రమణ బాబు, మండల ఆర్గనైజేషన్ కార్యదర్శి పిన్నయ్య, లోచలి పార్టీ అధ్యక్షులు లోచలి మహేష్, బూత్ కన్వీనర్ రమేష్, శివ, యూనిట్ ఇంచార్జి వెంకట్, సింహాచలం, యూనిట్ ఇంచార్జి వెంకట్, కుంబిడి సింగి పార్టీ అధ్యక్షులు సేవా మోహన్‌రావు, రాజు తదితరులు హాజరయ్యారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: అనకాపల్లి జిల్లాను కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ముఖ్యంగా జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు పరిహారం అందించాలని, పంట రుణాలు రద్దు చేయాలని, స్వల్పకాలిక పంటలకు అవసరమైన విత్తనాలు ఉచితంగా రైతులకు సరఫరా చేయాలని అన్నారు. అలాగే వ్యవసాయ బోర్లకు తొమ్మిది గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేసి కరువు నుండి శాశ్వత విముక్తి కల్పించాలన్నారు. జలాశయాల పై భాగంలో మైనింగ్ తవ్వకాలు నిషేధించాలని, కౌలు రైతులకు కూడా పరిహారం అందించాలని 11 రకాల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ రమేష్ బాబుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, ఎర్ర దేవుడు, గొర్ల మహేష్, వనము సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ ఒకటి నుండి జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అక్టోబర్ 1వ తేదీ నుండి 45 రోజుల పాటు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రణాళికా బద్దంగా, పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇంటింటి సర్వేలో వాలంటీర్లు పాల్గొనటం లేదని తన దృష్టికి వచ్చిందని, వాలంటీర్లు తప్పనిసరిగా పాల్గొనే విధంగా తగు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో రక్త హీనతతో భాద పడేవారు, పౌష్టికాహార లోపంతో భాద పడేవారు, ఎక్కువగా ఉన్నారని వారిని గుర్తించి వైద్య శిబిరాలకు తరలించి చికిత్స అందించాలని కోరారు.

ఈ వీడియో సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ బాష, రాష్ట్ర నోడల్ అధికారి డా. రమేష్ బాబు, డిసిహెచ్ఎస్ డా. కృష్ణా రావు, టి.బి నియంత్రణాదికారి డా. విశ్వేశ్వర నాయుడు, మండలాల నుండి తహసిల్దార్లు, ఎంపిడిఓలు, వైద్యాదికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో ఉన్న హైస్కూల్లో చదువుతున్న 400 మంది విద్యార్థులకు విశాఖపట్నం ఐ హాస్పటల్ సౌజన్యంతో కంటి పరీక్షలు సోమవారం నిర్వహించారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించే డాక్టర్లకు, సిబ్బందికి పాఠశాల ఉపాధ్యాయులు, సత్యసాయి సేవాదళ్ సభ్యులు పూర్తి సహాయ సహకారాలు అందించారు.

అర్జీదారుల్లో సంతృప్తిస్థాయి పెరగాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ. మల్లికార్జున జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారం మరియు పలు విషయాల పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంకు వచ్చే అర్జీదారులు పరిష్కార విషయంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. అలాగే రీఓపెన్ అయిన అర్జీలు, సంతృప్తి చెందని దరఖాస్తులు,ఏ.పి పోర్టల్ లలో పెండింగ్ లో ఉన్న అర్జీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవకులుగా భావించి, జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. వచ్చిన అర్జీలు నిర్ణిత గడువులోగా పరిష్కరించ బడాలని ఆదేశించారు. ఏపి పోర్టల్ నందు పెండింగులో ఉన్న అర్జీలన్నింటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 269 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జివిఎంసి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక విధులతోనే గిరిజన అభివృద్ధి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: గిరిజన అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్క అధికారి అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే గిరిజన అభివృద్ధి సాధ్యపడుతుందని మండల ఎంపీపీ బాకా ఈశ్వరి అధికారులకు సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీడీవో ఎం.ఉషారాణి ఆధ్వర్యంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులతో సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల ద్వారా విషయాలను తెలుసుకుని అభివృద్ధి వైపు మొగ్గుచూపాలని అన్నారు. గిరిజన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు విద్యా వైద్యం రహదారుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. నాడు నేడు పథకం ద్వారా నిర్మాణాలు జరుగుతున్న పాఠశాల భవనాలు పలు గ్రామాల్లో త్వరితగతిన నిర్మాణ పనులు జరగడం లేదని, అలాగే పలు పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రధానోపాధ్యాయులు పలువురు బదిలీలపై వెళ్లిపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు పలు పంచాయతీల ప్రజా ప్రతినిధులు మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ సభ్యురాలు సిహెచ్ జానకమ్మ, మండల తహశీల్దార్ సిహెచ్ నాగమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, లలిత పాల్గొన్నారు.

28న షూటింగ్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర -ఆనందపురం: జిల్లాస్థాయి షూటింగ్ బాల్ సబ్ జూనియర్ బాలుర ఎంపికలు గ్లోబల్ స్కూల్ గ్రౌండ్‌లో సెప్టెంబర్ 28 తేదీన వైజాగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతాయని అధ్యక్షులు ఇల్లాపు వెంకట జగన్, కార్యదర్శి,కిషోర్ కుమార్ తెలిపారు. 16 సంవత్సరాల వయసు ఉన్న విద్యార్థులకు ఎంపికలు ఉంటాయన్నారు ముఖ్యఅతిథిగా గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ కిషోర్, లలిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామకృష్ణలు హాజరవుతారని, గెలుపొందిన వారు అక్టోబర్ 18, 19 తేదీల్లో జరుగునున్న క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

5వ జోన్‌లో సీజ్ చేసిన వస్తువుల వేలం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జ్ఞానపురం 5వ జోన్ కార్యాలయం నందు అశోక్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సీజ్ చేసిన దుకాణములలోని వివిధ వస్తువులను వేలం వేయనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్జీవి కృష్ణ తెలిపారు. దుకాణం నెంబరు ఒకటిలో విరిగిన చెక్క అరలు 03, విరిగిన ఫ్రంట్ టేబుల్ కౌంటర్ 01, పనిచేయని సీలింగ్ ఫ్యాన్ 01, పనిచేయని ట్యూబ్ లైట్ 01, అలాగే దుకాణం నెంబర్ రెండులో విరిగిన చెక్క అరలు 02, పనిచేయని వీడియోకాన్ పోర్టబుల్ టెలివిజన్ 01, డస్ట్ బిన్‌లు 02లకు బహిరంగ వేలం నిర్వహించబడునని తెలిపారు. కావున ఆసక్తి గలవారు తేదీ 2023 అక్టోబర్ 4వ తేదీ ఉదయం 11 గంటలకు జోనల్ కమిషనర్ కార్యాలయం జ్ఞానాపురం 5వ జోన్ నందు బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు.

ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యులకు సన్మానం

విశాలాంధ్ర - అనంతగిరి: మండల మండల పరిషత్ బాడీ ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఎంపీపీ నీలవేణి, కోఆప్షన్ సభ్యులు మదీనాలను ఎంపీడీవో కుమార్ ఇతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నీలవేణి మాట్లాడుతూ అధికారులు తోటి ప్రజా ప్రతినిధుల సహకారంతోనే రెండేళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామని అన్నారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేసినట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ సిబ్బంది సర్పంచులు పాల్గొన్నారు.

2024 ఎన్నికలలో సైకో జగన్ భూస్థాపితం ఖాయం

విశాలాంధ్ర - కశింకోట: 2024 ఎన్నికలలో సైకో జగన్ రెడ్డి భూస్థాపితం ఖాయం అని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా, క్షేమంగా తిరిగి రావాలని కోరుతూ కశింకోట మండలం, పేరాంటాల పాలెం గ్రామంలో సుమారు 1000మంది మహిళలు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శారద నది నుండి బిందెలతో నీళ్ళు తెచ్చి శివుడికి అభిషేకం చేశారు. పరమ శివుడి అనుగ్రహంతో బాబు గారు క్షేమంగా తిరిగి రావాలని పూజలు చేశారు. సైకో పోవాలి - సైకిల్ రావాలని, మంచోడు జైలుకి- చెడ్డోడు బయట అంటూ మహిళ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, గొంతిన శ్రీనివాసరావు, పెంటకోట రాము,బుద్ధి రెడ్డి గంగయ్య, ఎంపీటీసీ బుద్దిరెడ్డి అప్పుడు, యువత అధ్యక్షుడు సిద్ది రెడ్డి సూర్యనారాయణ, కలగా సోమేశ్వర రావు, బుద్దిరెడ్డి రామరావు, కాండ్రేగుల సతీశ్ కుమార్,తిర్రి చిరంజీవి,మాజీ ఎంపీటీసీ బాబురావు, చెబొలు సూరిబాబు,గొంతిన ప్రసాద్, బండారు రామరావు,కేమిశెట్టి గోవింద, లింగేశ్వర రావు, మండపాక నాగేష్, బండారు వెంకటేష్, ప్రసాద్, గంగా శ్రీను, బద్ది గోవింద, దత్తాత్రయ, సురేశ్, మాజీ ఎంపీటీసీ సాంబమూర్తి,నైనంశెట్టి రమణ రావు, ఉల్లింగల రమేష్, షేక్ బాబర్, వెంకట లక్ష్మీ,తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేటర్ల ముట్టడిని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఈ నెల 30 తేదీన జరిగే ఉపాధ్యాయుల కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటపతిరాజు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ప్రభుత్వము ఇచ్చిన హామీల మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ కార్యదర్శి ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్న తీరు ప్రవర్తన సరిగా లేదని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ధర్మారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాసరావు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి జి.సునీల్, ఉపాధ్యక్షులు గోవిందరావు, దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ది రాక్షస పాలన

విశాలాంధ్ర - అరకులోయ: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో జగన్ రాక్షస పరిపాలన చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నర్సయ్య అన్నారు. సోమవారం అంగన్వాడి ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ఖండిస్తూ అంగన్వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. ఎన్నికల్లో జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలుకు ఉద్యమిస్తుంటే మహిళలని కూడా చూడకుండా రాక్షసత్వంగా పోలీసులు చేత ఉద్యమాన్ని అణిచివేస్తున్నారని అన్నారు. ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు అసెంబ్లీ, పార్లమెంట్లో మాట్లాడకపోవడం విచారకరమని అన్నారు. భవిష్యత్తులో పోరాడే వ్యక్తుల్ని అసెంబ్లీకి పార్లమెంట్‌కి పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు జయ, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గా నాగమ్మ, సిఐటియు అరకులోయ మండల కార్యదర్శి జె. భగత్ రామ్, అంగన్వాడి నాయకులు పి.వెంకటలక్ష్మి, కళావతి, లక్ష్మి, కొండమ్మ, సత్యవతి, మంజుల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

29న మహాధర్నాకు తరలిరండి

విశాలాంధ్ర - భీమిలి: ఈ నెల 29న విజయవాడ ధర్నా చౌక్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగనున్న మహాధర్నా కార్యక్రమానికి హాజరుకావాలని అఖిలభారత కార్యవర్గ సభ్యురాలు, రాష్ట్ర కెవిపిఎస్ ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి పిలుపునిచ్చారు. భీమునిపట్నం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అంబేద్కర్ కాలనీలో మహా ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పటిష్టంగా అమలు చేయాలని, అలాగే కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు పారువల్లి నర్సింగరావు, భాగం కృష్ణ, గుర్రపు వెంకటరమణ, బంకపల్లి కొండబాబు, కృష్ణ, రవ్వ అప్పారావు, కెవిపిఎస్ సభ్యులు మామిడి వెంట శివ పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా కోరాడ వేణుగోపాల్

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం తహశీల్దారుగా కోరాడ వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన భీమిలి తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై పద్మనాభం మండలం తహశీల్దార్‌గా పదవీ బాధ్యతలను చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన తోట శ్రీవల్లి గాజువాకకు బదిలీ కావడంతో వేణుగోపాల్‌కు బాధ్యతలు అప్పగించారు.

విశాలాంధ్ర

➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

భారీ అన్నసమారాధనలు

విశాలాంధ్ర - రావికమతం: మండలంలో గల కొత్తకోట వృషభరాజ ఆలయం వద్ద నందీశ్వర యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడు విగ్రహం వద్ద సోమవారం గ్రామస్తులు సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడి సత్యదేవ, శీలం శంకరరావు, గుమ్మడి దోరబాబు, ఎం పి టి సి కుంచా శంకరరావు, మాజీ సర్పంచ్ కోట నీలవేణి, గోవిందరావు, గుమ్మడి రమేష్, కొసిరెడ్డి శివాజీ, నందీశ్వర యూత్ సభ్యులు శీలం గౌతం, శేనాపతి రాజా తదితరులు పలువురు గ్రామస్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని గణనాథుని అన్నప్రాసాదాన్ని స్వీకరించారు.

కొమ్మాది: జీవీఎంసీ జోన్-2 మధురవాడ 5వార్డుల పరిధిలో వినాయక చవితి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. శారదానగర్,రాజీవ్ గృహకల్ప న్యూకాలనీ,సద్గురు సాయినాథ్ కాలనీ,స్వతంత్రనగర్,ప్రాంతాలలో నిర్వహించిన భారీ అన్నసంతర్పణలకు టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, టిడిపి విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వాండ్రాశీ అప్పలరాజు,బోయి వెంకట రమణ(శ్రీను),భీమిలి టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను,టిడిపి వార్డు ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసాదవితరణ నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ..తొలి పూజ్యుడు గణనాథుడిని దర్శించుకుంటే ఎటువంటి ఆటంకాలు కలగవని అన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సేవాసంఘంల నాయకులు దేవర శివ,ఆనందరావు,ఈగల అప్పలనాయుడు, నరేంద్ర, కెల్లా అప్పలరాజు, లక్ష్మణరావు, సునీత,రాజు, రమణ, నమ్మివాసు, ఇయ్యపు నాయుడు, ఓలేటి శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాలరాయడం తగదు

విశాలాంధ్ర - చోడవరం: న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమం భగ్నం చేసెందుకు ముందస్తు చర్యలుగా సి.ఐ.టీ.యు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మిని గత రాత్రి చోడవరం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు ధర్నాకు వెళ్లకుండా అడుగడుగునా అడ్డుకోవడం, నిర్బంధించడం కార్మికుల హక్కులను కాలరాయడమే అన్నారు.

పండిట్ దీన్ దయాల్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర - పెందుర్తి: భారతీయ జనతా పార్టీ పెందుర్తి నియోజకవర్గం కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని దీన దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము నాయుడు మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ పాశ్చాత్య సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయంగా భారతీయ విలువలకు ప్రతిరూపంగా సిద్ధాంతాన్ని అందించిన స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేపగుంట మండల జనరల్ సెక్రెటరీ పెన్నం రమేష్, పార్టీ నాయకులు పార్వతి, సావిత్రి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీ పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర - చింతూరు: ఆదివాసి గ్రామాల్లోని గ్రామ పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏ వి యస్ పి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడి మురళి స్థానిక గిరిజన బాలుర వసతి గృహంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిమ తెగల యొక్క సంస్కృతి సంప్రదాయాలు భారత దేశానికే గర్వకారణం అని వాటిని కాపాడుకోవలసిన బాధ్యత ఆయా తెగల యొక్క ఆదివాసీ పౌరులదేనని స్పష్టం చేశారు. ఈ సమావేశం లో సోడి సత్యనారాయణ, బాబు శ్రీను, కారం వెంకటేశ్వర్లు, అక్కిపాలి. చందు, పాయం విద్య సాగర్, సోడి ప్రకాష్, కుర్సం వీరయ్య పాల్గొన్నారు.



నామట్టి ..నా దేశం

విశాలాంధ్ర - మునగపాక: నా మట్టి - నా దేశం కార్యక్రమంలో భాగంగా మునగపాక గ్రామ పురవీధుల మీదుగా మహిళలతో చిటికెలభజన , చిడతలు వేస్తూ ఎంపీపీ మళ్ల జయలక్ష్మి , గ్రామ సర్పంచ దిమ్మల అప్పారావు , మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, ఎలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ పిల్లి అప్పారావు , మాజీ జెడ్పిటిసి మళ్ళ సంజీవరావు , వాలంటీర్లు, కార్యకర్తలు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది సంధ్య. దొడ్డి గోవిందు, గ్రామ పెద్దలు ఊరేగింపుగా గ్రామ పురవీధుల మీదుగా తిరిగి గ్రామ ప్రజల నుండి బియ్యం,మట్టి సేకరించడం జరిగింది.

అంగన్వాడీ కార్మికుల అక్రమ అరెస్ట్‌లపై ఖండన

విశాలాంధ్ర - చింతూరు: అంగన్వాడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలనీ రాష్ట్ర స్థాయి అధికారులకు ముందుగానే సమాచారం ఇచ్చి శాంతియుత ఆందోళనకు వెళ్తున్న అంగన్వాడీ కార్మికులను అక్రమంగా పోలీస్ వారిని పెట్టి ఎక్కడికి అక్కడ అరెస్ట్ లు చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, సీసం సురేష్ విమర్శించారు. అక్రమంగా అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చింతూరులో అంగన్వాడి కార్మికులు రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో తుమ్మల ఎంపీటీసీ రాజకుమార్, గోవింద్, శ్రీను, అంగన్వాడీ కార్మికులు వెంకటరమణ, దుర్గ, జయ, పొద్దమ్మ, వీరమ్మ, అన్నపూర్ణ, చుక్కమ్మ, నాగమణి, చిట్టెమ్మ, మణీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలపై నిర్బంధం అమానుషం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యలపై చర్చించుకోవడానికి సిఐటియు ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టారని, ఆ కార్యక్రమాన్ని విఫలం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడికక్కడ అంగన్వాడీ కార్యకర్తలను అరెస్టులు చేసి నిర్బంధిం చారని, ఇది

అమానుషం అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రం రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు గొంతెమ్మ కోర్కెలు కోరడానికి బయలుదేరలేదని, మాకు గౌరవ వేతనం పెంచండి, మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి అని ఎన్నో ఏళ్ల నుంచి పోరాటం చేస్తుంటే ఆ పోరాటాలకు అడ్డుకట్ట వేయాలని ప్రయత్నించటం సమంజసం కాదని, అలాగే అంగన్వాడి సమస్యలను తక్షణమే అసెంబ్లీలో చర్చించి వారికి 26వేలు వేతనం ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్న బాబు వడ్లా ది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: సమగ్ర శిక్ష సొసైటీలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేస్తున్నారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఆర్డిఓ ఆఫీస్ దగ్గర ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష సొసైటీ ఉద్యోగులకు బీఎస్పీ పార్టీ మద్దతు ప్రకటించడం జరిగింది. వాళ్లకు సంఘీభావంగా ఆర్డిఓ ఆఫీస్ దగ్గరికి నిరసనలోను పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బొట్టా నాగరాజు మాట్లాడుతూ సమగ్ర శిక్ష సొసైటీ లో పనిచేస్తున్నటువంటి ఉద్యోగులకు అండగా ఉంటామని అలాగే ఏ కార్యక్రమం చేసిన మద్దతు ఇస్తామని, సీఎం జగన్మోహన్ రెడ్డి గారు ప్రతిపక్ష నాయకుడుగా ఉంటూ పాదయాత్రలో అనేక హామీలు వర్షం కురిపించడం జరిగిందని, దాంట్లో భాగంగానే ఈ ఉద్యోగులకు కూడా క్రమబద్ధీకరిస్తామని, ప్రతి నెల జీతం ఇస్తామని అనేక హామీలు ఇవ్వడం జరిగిందని, సీఎం జగన్ ప్రభుత్వం ఏర్పాడి 4సం. లు అవుతున్న ఇంతవరకు ఇచ్చిన హామీలలో ఒక్కటికూడా అమలు చెయ్యలేదని,త ఇచ్చిన హామీలు అమలు ఇచ్చిన హామీలన్నీ తెడ్డు దాటిన తర్వాత బోడు మల్లన్న అనే విధంగా ఉందని, జీతాలు ప్రతినెల ఇవ్వకుండా, పని ఒత్తిడి పెంచుతూ నానా రకాలుగా ఉద్యోగులును ఇబ్బంది పెడుతున్నాడని,. గతంలో చంద్రబాబు నాయుడు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్ల ఏ గతి పట్టిందో జగన్మోహన్ రెడ్డి కి కూడా అదే గతి తప్పదని హెచ్చరించడం జరిగింది. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి, మాట నిలబెట్టుకోవాలని,సమగ్ర శిక్ష సొసైటీ ఉద్యోగాలను క్రమబద్ధికరణ చేయాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ బిఎస్పి కన్వీనర్ కొల్లు గంగాధర, బహుజన ఐక్య వేదిక నాయకులు రాజు మరియు అనేకమంది ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.

క్యూసీ విజేతలకు అభినందనలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్ ప్లాంట్‌లో జరిగిన 23వ క్యూసీ (క్వాలిటీ సర్కిల్) పోటీల్లో బంగారు పతకం సాధించిన ఎల్ఎంఎంఎం టీంను విభాగాధిపతి ఎం.శ్రీనివాసప్రసాద్ అభినందిం చారు. ప్లాంట్లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ఉద్యోగులను అభినందించి మాట్లాడుతూ ఉద్యోగుల అద్భుత ప్రతిభ కారణంతో ప్లాంట్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఉద్యోగులకు యాజమాన్యం అన్ని విధాల సహకారం అందిస్తుందన్నారు. అదే విధంగా ఈ విభాగం ప్లాంట్ లెవల్ 5ఎస్లో 2022-23సంవత్సరంలో ప్రధమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కె.రమేష్, అవార్డు గ్రహితలు డి.వీరకేసరి, చంద్రకాంత్ తుడు, బి.నాగరాజు, పి.సీతారామరాజు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్ఓ

విశాలాంధ్ర - నాతవరం: మండలంలో పిచ్చిగంటి కొత్తగూడెం వీఆర్వో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఫిర్యాదిదారుడు రెడ్డి సన్యాసి నాయుడుకు చెందిన భూమి మ్యూటెషన్ చేయటకు, పట్టదారు పాస్ పుస్తకం ఇప్పించుటకుగాను వి.ఆర్.ఓ సి.హెచ్.సత్యనారాయణ రూ.4,000/- బాదితుడిని డిమాండ్ చేసి రూ.2,000/- లంచంగా ఫోన్ పే ద్వార ట్రాన్స్ఫర్ చేయించుకొని మిగతా డబ్బులు కొరకు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీనిపైన కేసు నమోదు చేసుకున్న అధికారులు సోమవారం.నాతవరం మండల కార్యలయం వద్ద వి.ఆర్.ఓ సి.హెచ్. సత్యనారాయణ, ఫిర్యాదిదారుడు వద్ద నుండి రూ.2,000/- లంచంగా తీసుకుంటుండగా విశాఖపట్నం రేంజ్ అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడ్ని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు చేస్తామని తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం కల్పించండి

విశాలాంధ్ర - చింతపల్లి : - గడచిన 15 నుంచి 25 ఏళ్ళుగా విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్నామని తమకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అల్లూరి జిల్లా విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు కిముడు బిలాస్కర్, అల్లూరి జిల్లా అధ్యక్షుడు నాడెల సత్యరావుతో కలిసి మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి సోమవారం లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిలాస్కర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 3800 మంది విద్యుత్ మీటర్ రీడర్స్ గా పనిచేస్తున్నామన్నారు. వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తి అయినప్పటికీ తమ సేవలు వినియోగించు కుంటున్నారే తప్ప, తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు మీటర్ రీడర్స్ సంఘం నాయకులు నాగరాజు, కంకిపాటి ఆనంద్, ఉల్లి మత్స్యరాజు, బొండం స్వామినాథ, కొండకించంగి మనోజ్ కుమార్, మొట్టడం వెంకట్రాజు, గుండ్ల ధర్మారావుపాల్గొన్నారు.

చెరుకు మద్దతు ధర టన్నుకు 4500లు ఇవ్వాలి

విశాలాంధ్ర - చోడవరం: చెరకు మద్దతు ధర టన్నుకు రూ.4500లు చెల్లించాలని జిల్లా కౌలు రైతులు సంఘం డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం వద్ద సోమవారం కౌలు రైతుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. వరహాల బాబు మాట్లాడుతూ గతేడాది గోవాడ సుగర్స్ కు సరఫరా చేసిన చెరకు చివర క్రషింగ్ పేమెంట్లు నేటికీ చెల్లించకుండా ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులు పట్ల మొండి వైఖరి అవలంబిస్తోంది అన్నారు. రైతాంగం పై చిన్న చూపు చూస్తున్నారని, వ్యవసాయానికి వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి, పెట్టుబడి పెట్టి పండించే చెరకు కు, సుగర్ ఫ్యాక్టరీ నేటి వరకు పేమెంట్ చేయకపోవడంతో రైతులు మళ్ళీ అప్పులు పాలవుతున్నారని తెలిపారు. కార్మిక, కర్షకులకు వేతన భత్యాలు చెల్లించకుండా షుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్, లక్షలాది రైతు కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలియజేశారు. ఈ నెల 29న జరగబోయే ఫ్యాక్టరీ మహాజన సభలో టన్ను చెరుకు మద్దతు ధర రూ. 4500 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సభ్య రైతులకు సకాలంలో పేమెంట్లు ఇవ్వాలని, ఎరువులు విత్తనాలు ఉచితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాము, ఎర్రి నాయుడు, శీను, కసిరెడ్డి దేవుడు, నాయుడు, బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించే నైజం చంద్రబాబుది

విశాలాంధ్ర - చింతపల్లి: నైపుణ్యాభివృద్ధి వంటి శిక్షణావకాశాలు కల్పించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే నైజం తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడుదైతే, బటన్ నొక్కి నగదు జమ చేస్తున్నామని చెబుతూ భవిష్యత్ తరాలకు ఉపాధి లేకుండా చేయడమే గాక, ప్రశ్నించే ప్రతి పక్ష నాయకులపై కక్ష సాధించే తత్వం వైకాపా అధినేత వై యస్ జగన్మోహన్ రెడ్డిదని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనంద్ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టుపై వాస్త వాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తామన్నారు. న్యాయం చంద్రబాబు పక్షాన ఉందన్నారు. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు వల్ల రాష్ట్రంలో ఎంతో మంది యువతీ, యువకులు ఉపాధి పొందారన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికలలో వైకాపా పతనం ఖాయమని వారు జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తెదేపా బూత్ కన్వీనర్ బేతా నాగు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం స్థానచలనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - భీమిలి: అంబేద్కర్ విగ్రహం స్థానచలనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు వ్యవస్థాపకులు డిమాండ్ చేశారు. భీమునిపట్నం మండలం తాటితూరు పంచాయితీలో గత 35 ఏళ్లగా ఉన్న అంబేద్కర్ విగ్రహం ఉన్న స్థలము నుండి వేరే స్థలంలో స్థానచలనం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు వ్యవస్థాపకులు, లాయరు భాగంగోపాలరావు, దళిత సంఘాల నాయకులు పారుపల్లి నర్సింగరావు, జి.వి.రమణ, రవ్వ అప్పారావు, బి.కృష్ణ, దళిత సంఘాలు ఐక్యవేదిక ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి భీమిలి సీఐ డి.రమేష్‌కు ఫిర్యాదు చేశారు. విగ్రహం తొలగించటానికి సహకరించిన టీడీపీ నాయకులను జేసీబీ డ్రైవర్, యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు పారుపల్లి నర్సింగరావు, జి వి రమణ, రవ్వ అప్పారావు భాగం కృష్ణ డిమాండ్ చేశారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ డెంగ్యు జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవగాహన అవసరమని, ఈ జ్వరం ప్రమాదకరమని, ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స సదుపాయాలు ఉన్నాయని ఏ.ఎమ్.సి డాక్టర్ రామిరెడ్డి, గ్రామీణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాయక్ , ఇతర డాక్టర్లు అన్నారు. విజినిగిరిపాలెంలో ప్రజల్ని డెంగ్యు వ్యాధి బారిన పడకుండా అప్రమత్తం చేశారు. మంచి నీటిలో మాత్రమే ఈ టైగర్ దోమలు వృద్ధి చెందుతాయని ఇంటి పరిసరాలలో మంచి నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు. ఈ దోమ బరువుతో కూడుకుని చారలు కలిగియుండి మనుషుల మోకాళ్ళ కింది భాగంలో కుట్టడం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందని అన్నారు. అందుకే ఇంటిలో మంచి నీరు నిల్వ లేకుండా ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించి కొత్తగా నీటిని పాత్రలలో నింపుకోవాలని చెప్పారు. ఈ డెంగ్యు వైరస్ దోమ కాటు తరువాత 3 నుండి 14 రోజులలో వ్యాధి సోకవచ్చని అన్నారు. అందుకే ఇంటి వద్ద టైర్లలో, చిన్నపాటి గుంటలలో వర్షపు నీరు కూడా నిల్వ లేకుండా చూడాలని అన్నారు. డెంగ్యు వ్యాధి సోకినవారు ప్రైవేటు ఆసుపత్రులకన్నా ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందాలని అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డెంగ్యు వ్యాధి మూడు రకాలుగా ఉంటుందని అందులో హేమరేజ్, షాక్ సిండ్రోం రకాలు ప్రమాదకరమైనవని ప్లేట్ లెట్స్ ఎక్కించవలసిన అవసరం వస్తుందని తెలిపారు. అందుకే మనం దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వైద్యులతో, వారి సిబ్బందితో పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా చూస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

అనంతగిరి చేరిన స్టీల్ పరిరక్షణ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - అనంతగిరి: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ రక్షణ బైక్ యాత్ర సోమవారం విజయనగరం జిల్లా ఎస్ కోట నుంచి వెంకయపాలెం ప్రవేశించింది. ముందుగా వెంకయపాలెం గ్రామ మహిళలు గిరిజన సాంప్రదాయ బదంగా తిలకం దిద్ది పూల మాలలు వేసి స్వాగతం పలికారు. మహిళా సంఘాల సభ్యులు దేమడమ్మ కాసులమ్మ శ్రావణి దేవి స్వాగతం పలికారు. అనంతరం జూనియర్ కళాశాల అవరణలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం, అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోడి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సోమెల నాగులు, టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, బైక్ యాత్ర రధ సారదులు జగన్, దేవన్న, సుబ్బారావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో శరగడం చిన అప్పలనాయుడు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవిఎంసి 96వ వార్డు పరిధిలో పలు చోట్ల జరుగుతున్న వినాయక ఉత్సవాల్లో మాజీ కార్పోరేటర్, రాష్ట్ర బిసి సంఘాల నాయకుడు శరగడం చిన అప్పలనాయుడు పాల్గొన్నారు. సోమవారం ద్రోణం రాజు నగర్, జెఎన్ఎన్ యుఆర్ఎం కాలనీ నల్ల క్వారి దగ్గర ఏర్పాటు చేసిన వినాయక మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అలాగే ఆయా వేదికల వద్ద నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమాలను శరగడం చిన్న అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సిద్ధి వినాయకుడి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేగి శ్రీనివాసరావు, మల్లేష్, పెంటకోట నాయుడు, ఆ ప్రాంత నాయకులు, శరగడం అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదలకై శివాలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - గొలుగొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, పాత మల్లంపేట సర్పంచ్ గెడ్డం ఆనంద్ అన్నారు. సోమవారం మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీశ్రీ దార మల్లేశ్వర స్వామి ఆలయంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ యువకులు మహిళలతో 101 కొబ్బరికాయలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచినటువంటి ఆలయం అయినందున చంద్రబాబు నాయుడు జైలు నుండి నిర్దోషిగా బయటకు రావాలని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సైకో పోవాలి చంద్రబాబునాయుడు బయటకు రావాలి అంటూ యువకులు మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాత మల్లంపేట మాజీ సర్పంచ్ చిటికెల సాంబమూర్తి, లింగన్న దొరపాలెం సర్పంచ్ గద్దం సత్యనారాయణ, జోగంపేట, పాత మల్లంపేట, గొలుగొండ జోగుంపేట యూత్ సభ్యులు అధికంగా పాల్గొన్నారు.

విశాఖలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ కొత్త కార్యాలయం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ విశాఖపట్నంలోని కొత్త కార్యాలయాన్ని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ ఏపీ, తెలంగాణ రీజనల్ హెడ్ ఆచంట శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. పాత శాఖకు బదులు కొత్తకార్యాలయాన్ని ద్వారకానగర్ ఐదోల్కెన్, సీతంపేట మెయిన్ రోడ్డులో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొత్తకార్యాలయం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉందన్నారు. ఈ ఏరియాలో తమ వృద్ధిని కొనసాగించడానికి, లోకల్ మార్కెట్‌లో మరింత విస్తరణ కోసం ఇది ఎంతగానో ఉపయోగపడనుందని తెలిపారు. దేశంలో ఉన్న రిటైల్ పెట్టుబడిదారులను చేరుకోవడానికి కంపెనీ కట్టుబడి ఉందన్నారు. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ వ్యాప్తిని మెరుగుపరిచే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.

యూసీడీ పీడీ అవినీతిపై మూర్తి యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష

భగ్నం చేసిన పోలీసులు, జనసేన నేతలు అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జీవీఎంసీ లో అవినీతికి పాల్పడుతున్న యుసిడి పీడి పాపునాయుడు పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం గేటు వద్ద ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. ఆయనకు జనసేన నేతలు పంచకర్ల రమేష్ బాబు, కోన తాతారావు, పిఎస్ఎన్ రాజు , వసుపులేటి ఉషా కిరణ్ తదితర నేతలు మూర్తి యాదవ్ కు సంఘీభావంగా పాల్గొన్నారు. దీక్షకు దిగిన గంట వ్యవధిలోనే పోలీసులు మూర్తి యాదవ్ ను బలవంతంగా అరెస్ట్ చేశారు. దీక్షలు భగ్నం చేసి జనసేన నేతలు అందరిని అరెస్ట్ చేసి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా జనసేన నేతలు మాట్లాడుతూ జీవీఎంసీ లో వైసీపీ పాలకవర్గం అవినీతిమయంగా పాలన అందిస్తుందని, మేయర్, డిప్యూటీ మేయర్లు, వైసీపీ ఫ్లోర్ లీడర్ జివిఎంసి అధికార యంత్రాంగాన్ని అవినీతిమయంగా మార్చి, ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని మండిపడ్డారు. డిప్యూటీ మేయర్లు ఇరువురు యూసీడి పి డి కె వి పాపునాయుడు కి కొమ్ము కాస్తున్నారని, పెదవాల్తేర్ ఆదర్శ గ్రామం లో 120 ఇళ్లలో 74 మంది అనర్హులు అని చెప్పామని, 15 మందికి దొడ్డి దారిలో అవినీతి కి పాల్పడి యూసీడీ పీడీ ఇళ్లు కేటాయించారన్నారు. ఆధారాలతో కమీషనర్ కు కూడా ఫిర్యాదు చేసామని, ఆదర్శ గ్రామంలో సొషల్ ఆడిట్ చేయాలని కోరామన్నారు. ఫుడ్ కోర్ట్ లో 40 దుకాణాలు కాస్త 169 దుకాణాలు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. ఫుడ్ కోర్ట్ కమిటీ చైర్మన్ డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్ చట్టవిరుద్ధంగా ఫుడ్ కోర్ట్ కి కొమ్ము కాస్తున్నారన్నారు. యూసిడి పిడి పాపు నాయుడు పప్పుల ఉప్పుల వ్యాపారిని బినామీగా ఉంచి సొమ్ములు కాజేస్తున్నారన్నారు. జె ఎం ఆర్ సంస్థ ఎడిసి కి ఒక స్కార్పియో వాహనం బహుమతిగా ఇచ్చిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. జీవీఎంసీలు అవినీతిపై ప్రశ్నిస్తే జనసేన నేతలపై అసత్య ఆరోపణలకు దిగుతున్నారని మండిపడ్డారు. విశాఖ నగర అభివృద్ధి కోసం జనసేన ఎల్లప్పుడు పోరాడుతుందని అన్నారు.

అరకు కాఫీ మార్కెటింగ్‌కు వేదికగా వరల్డ్ కాఫీ కాన్ఫరెన్స్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: బెంగళూరులో జరుగుతున్న వరల్డ్ కాఫీ కాన్ఫరెన్స్... అరకు కాఫీ మార్కెటింగ్ కు ప్రత్యేక వేదిక గా నిలిచిందని పార్లమెంట్ సభ్యులు గొడ్డేటి మాధవి పేర్కొన్నారు. బెంగళూర్ లో జరుగుతున్న ప్రపంచ కాఫీ సమావేశంలో ఐటిడిఎ, జిసిసి ఏర్పాటు చేసిన కాఫీ పెవిలియన్ ను ఎంపి మాధవి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ, బెంగళూరు మహారాణి కోటలో ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల ప్రతినిధులు పాల్గొన్న వరల్డ్ కాఫీ కాన్ఫరెన్స్ కు ఆంధ్ర ప్రదేశ్ నుండి పాడేరు ఐటిడిఎ, జిసిసి పాల్గొనడం శుభ పరిణామమని, అరకు కాఫీ ప్రపంచ వ్యాప్తంగా అందరికీ పరిచయం చేయటంతో పాటు కాఫీ మార్కెటింగ్ కు విస్తృత అవకాశాలు లభిస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకుని అరకు కాఫీని ప్రపంచ స్థాయిలో మార్కెటింగ్ చేయాలని ఎంపి సూచించారు. అరకు కాఫీని ప్రపంచానికి పరిచయం చేయటానికి ఈ వేదికను ఉపయోగించుకోవాలని, అల్లూరి జిల్లాలో కాఫీ పంటను విస్తృత పరిచే దిశగా రైతులు ముందుకు వస్తే వారికి ప్రోత్సాహం అందిస్తామని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో జిసిసి

మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్, జనరల్ మేనేజర్ యూస్తఫ్, కాఫీ డిడి రమేష్, ఏడి అశోక్, మాజీ మంత్రి మణికుమారి, చింతపల్లి మాక్స్ ప్రతినిధులు, సుమారు 150 మంది కాఫీ రైతులు పాల్గొన్నారు.

అవకతకలు, అక్రమాల పుట్టగా రీ సర్వే

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం మండలం గౌరీపట్నం గ్రామంలో నిర్వహించిన రీ సర్వేలో పలు అక్రమాలు, అవినీతితో నిండినదని గ్రామస్థులు, రైతాంగం ఆరోపిస్తున్నారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ కుటుంబ తగాదాలు, ఉమ్మడి కుటుంబాల వారికి చెందిన భూముల్ని వి.ఆర్వో.,సచివాలయం సర్వేయర్ లు కొందరి వద్ద లంచాలు తీసుకుని అక్రమంగా వారికి పట్టాదారు హక్కులు కల్పించారని ఆరోపిస్తున్నారు. గ్రామ సభలు జరుపకుండా, బాధిత రైతులకు నోటీస్ ఇవ్వకుండా, నోటీసుల పై రైతుల సంతకాలు లేకుండా ఆర్వోఆర్ ఫైనల్ చేసి అధికారులకు పంపారని తెలిపారు. దీనిపై తహసీల్దార్, ఆర్.ఐ లకు పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ

పట్టించుకునే నాథుడే కరువయ్యాడు అన్నారు. దీంతో కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.లక్ష్మి, ఎం.పి.టి.సి. ఎం.జగన్నాథరావు, కె.కోటి, పద్మ తదితరులున్నారు.

జన సైనికుల ఆర్థికసాయం

విశాలాంధ్ర -దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో ములకలాపల్లి గ్రామానికి చెందిన జనసైనికుడు సలాది చక్రి కి ఇటీవలే రోడ్డు ప్రమాదం జరిగటంతో అతనికి గాయాలవటంతో మాడుగుల నియోజవర్గం జనసేన నాయకులు జన సైనికులు అందరూ కలిసి మూలకపల్లి

ఇంటి సురేష్ ఆధ్వర్యంలో30000 వేల రూపాయలు దేవరపల్లి మండలం జనసేన నాయకులు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు చేతుల మీదగా సోమవారం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజవర్గ నాయకులు రాయపురెడ్డి కృష్ణ, ముర్రు ఈశ్వర్,కాలంగి బలరాం,యాళ్ల ప్రసాద్, పైడా మధు, టి.సూరిబాబు, భాను, అప్పలనాయుడు అదిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: తోకాడ కళ్యాణ మండపంలో అక్టోబరు 2న ఉదయం 9గంటలకు శిష్ట కరణాల ఆత్మీయ సమ్మేళనంను

కూర్మన్నపాలెం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు పేర్కొన్నారు. సంతమామిడి తోట కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మేళనం లో పలు కీలక అంశాలపై చర్చించనున్నామని, ముఖ్యంగా ఓబీసీ సాధన, సేవా కార్యక్రమాలు విస్తరణ, కళ్యాణమండపం అభివృద్ధి ఇలా పలు అంశాలపై చర్చించనున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గంగవరం గోపి, ప్రతినిధులు డబ్బీరు గురునాదం, ఎం.శివాజీ పట్నాయక్, ప్రసాదావు, కిషోర్, శంకర్, బాబు పట్నాయక్, ఎం.రాయుడు, నర్సింహామూర్తి, చౌధురి రామకృష్ణ, శేఖరమంత్రి కిషోర్, పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర - ఆనందపురం: భారతీయ జనతా పార్టీ ఆనందపురం మండలం శాఖ ఆధ్వర్యంలో ఆనందపురం మండలంలో గల వెల్లంకి బిజేపి పార్టీ కార్యాలయంలో శ్రీ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజేపి మండల పార్టీ అధ్యక్షులు మీసాల రాము నాయుడు,విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్,విశాఖ జిల్లా మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు యోలూరు ధర్మవతి మాట్లాడుతూ అంత్యోదయ ప్రదాత సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్ఫూర్తితో మనమందరం పనిచేయాలి అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు,పి.జాని కేశ్వరావు,బోర శ్రీను,బోర శ్రీ, బిజేపి కార్యకర్తలు పాల్గొన్నారు.

టాటా గ్లూకో ప్లస్ స్పోర్ట్స్ డ్రింక్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్, భారతదేశంలోని అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్ యొక్క ప్రాంతీయ స్పాన్సర్ అయిన టాటా గ్లూకో ప్లస్ ఆ మార్కెట్ కోసం కంపెనీ అభివృద్ధి చేసిన కొత్త స్పోర్ట్స్ డ్రింక్, టాటా గ్లూకో స్పోర్ట్స్ డ్రింక్ ను విడుదల చేశారు. ఈ భాగస్వామ్యం ఏ ఎఫ్ ఏ తో ఒప్పందంలో భాగంగా వినియోగదారు అనుభవాలను మెరుగుపరచడంలో మరియు మరింత చురుకైన జీవనశైలిని ప్రోత్సహించడంలో టాటా కన్స్యూమర్ ప్రోడక్ట్స్ నిబద్ధతను ఏకీకృతం చేస్తుంది. భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన కంపెనీలలో ఒకదానితో చేసుకున్న ఈ భాగస్వామ్యం, అర్జెంటీనా నేషనల్ టీమ్‌తో భారతీయ అభిమానులను కనెక్ట్ చేయడానికి మరియు ఈ గొప్ప మార్కెట్లో తన బ్రాండ్ ఉనికిని విస్తరించడానికి ఏ ఎఫ్ ఏ కు ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ మరియు అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్ మధ్య ఈ భాగస్వామ్యం భారతదేశంలో ఏ ఎఫ్ ఏ యొక్క వాణిజ్య విస్తరణ తర్వాత 2021 ప్రారంభంలో ప్రారంభమైంది. అప్పటి నుండి, ఈ ప్రాంతంలోని అభిమానులు మరియు వినియోగదారులు అర్జెంటీనా సాకర్ స్టార్‌లకు గతంలో కంటే ఎక్కువ సన్నిహితంగా ఉండే ప్రత్యేకతను కలిగి ఉన్నారు, తమ అభిమాన ఆటగాళ్లతో ప్రత్యేకమైన క్షణాలను గడుపుతున్నారు. ఏ ఎఫ్ ఏ అధ్యక్షుడు క్లాడియో టాపియా చెప్పారు

ఇంపాక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ఫర్ గ్లోబల్ హెల్త్‌లో వ్యవస్థాపక సభ్యులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: న్యూయార్క్ నగరంలో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ అత్యున్నత స్థాయి సమావేశాలలో భాగంగా జరిగిన గ్లోబల్ హెల్త్ కోసం ఇంపాక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ (ట్రిపుల్) ప్రారంభ కార్యక్రమంలో, యూ ఎస్ ఏ ఐ డీ -మద్దతు కలిగిన సమ్రిధ్ హెల్త్‌కేర్ బ్లెండెడ్ ఫైనాన్స్ ఫెసిలిటీ మరియు దాని టెక్నికల్ సపోర్ట్ యూనిట్, ఐ పీ ఈ గ్లోబల్, 37 ఇతర ప్రముఖ సంస్థలతో కలిసి వ్యవస్థాపక సభ్యులుగా ప్రకటించబడ్డాయి. "2030 నాటికి మరింత సుస్థిర, సమానమైన మరియు స్థిరమైన సార్వత్రిక ఆరోగ్య కవరేజీ దిశగా " అనే కార్యక్రమాన్ని జపాన్ సొసైటీ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ నిర్వహించింది మరియు యూనివర్సల్ హెల్త్ కవరేజ్ కి కట్టుబడి ఉన్న ప్రపంచ నాయకులు దీనికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జపాన్ ప్రధాన మంత్రి ఫ్యూమియో కిషిడా, బిల్ గేట్స్, కో-చైర్, గేట్స్ ఫౌండేషన్ ప్రపంచ ఆరోగ్య సంస్థ , ప్రపంచ బ్యాంకు, యునిసెఫ్ మరియు గవి ప్రతినిధులు ముఖ్య ప్రసంగాలు చేశారు.ఐపీఈ గ్లోబల్ వ్యవస్థాపకుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్ అశ్వజిత్ సింగ్ , హెల్త్‌కేర్‌లో ఎక్కువ పెట్టుబడులకు భాగస్వామ్యాల సహకారాల అవసరాన్ని నొక్కిచెప్పారు.

ఘనంగా జాతీయ సేవా పథక దినోత్సవం

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రత్న మాణిక్యం తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సభకు అధ్యక్షత వహించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. హారతి మాట్లాడుతూ 1969 సెప్టెంబర్ 24 న జాతీయ సేవా పథకం ప్రారంభించబడి నేటికి 54 సంవత్సరాలకు పైగా సామజిక సేవలో ఏంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిందన్నారు . సామజిక సేవా భావంతో విద్యార్థులు బాధ్యతగా మెలగాలని, విద్యార్థి దశనుంచే సేవాదృక్పదాన్ని అలవార్చుకోవాలన్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయన్నారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు వ్యాస రచన, వాక్పత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రధానం చేసారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి వెంకట్రావు, ముల్లి శేఖర్, కె శకుంతల, డాక్టర్ వై పద్మ, అప్పనమ్మ, కె శైలజ, శ్రీదేవి, సిహెచ్ రాజాబాబు, కె శ్రీలక్ష్మి, ఆర్ మౌనిక, పి గౌతమి, జి సాయికుమార్, పి ఏడుకొండలు, అలివేలు తదితరులు పాల్గొన్నారు

పండిట్ దీన్ దయాళ్ ఆశయాలకు అనుగుణంగా మోది పాలన!

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్రమోడి పరిపాలన సాగుతోందని కేంద్ర మత్స్య శాఖ మంత్రి పురుషోత్తంరూపాల పేర్కొన్నారు. నగరంలోని లాసన్స్ బే కాలని బీజేపీ కార్యాలయంలో సోమవారం జరిగిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతం ఏకాత్మ మానవ వాద దర్శనం లక్ష్యంగా మోది పరి పాలిస్తున్నారని కొనియాడారు. ఈ విధానం తీసుకు వచ్చినా చిట్ట చివర నున్న పౌరుని వరకు చేరాలనే సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. గుజరాత్ ఎన్నికల ఎజెండాలో చేర్చకపోయినా పేదలకు 24 గంటలు విద్యుత్ ఇచ్చారన్నారు .108 అంబులెన్స్ ను మొదటిసారిగా గుజరాత్ లోనే అమలు చేశారన్నారు. నర్మదా యోజన కింద 9 కోట్ల మందికి తాగునీటిని అందించారన్నారు. ప్రధాని అయిన తర్వాత తమ సేవలను మరింత విస్తృతంగా అమలు చేస్తున్నారన్నారని, 50 కోట్ల మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు జారీ చేశారన్నారు. 84 లక్షల ఆరోగ్య కేంద్రాలు

జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేశారన్నారు .గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మెరుగుపరచడానికి విరివిగా నిధులు ఇస్తున్నారన్నారు. పొరుగు దేశాల్లో బందీలుగా వున్న 500 మంది మత్స్య కారులను విడిపించి దేశానికి తీసుకు వచ్చారన్నారు. వారిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు 20 మంది ఉన్నారన్నారు. దేశంలో మూడో మత్స్య విశ్వవిద్యాలయాన్ని విశాఖ నగరంలో ఏర్పాటు చేస్తున్నా మన్నారు. మత్స్యకారులకు క్రెడిట్ కార్డులు మంజూరు చేసిన ఘనత తమదన్నారు. ఈ సమావేశంలో రాజ్య సభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు, విశాఖ వుత్తర నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, నగర బీజేపీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, కాశీవిశ్వనాథ రాజు తదితరులు హాజరయ్యారు.

గ్లోబల్ టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్ విజేతలలో ఒకరిగా యువ కళాకారిణి కుమారి శృతి మనోజ్ఞ వేమూరి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీ కే ఎం) ప్రతిష్టాత్మకమైన 16వ గ్లోబల్ టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్ విజేతలలో ఒకరిగా విశాఖపట్నం కు చెందిన యువ కళాకారిణి కుమారి శృతి మనోజ్ఞ వేమూరిని సత్కరించింది. 90 దేశాలు, ప్రాంతాల నుండి 780,000 మంది పాల్గొన్న ఈ పోటీలో "టొయోటా టైమ్ ట్రాన్సిటర్" పేరుతో శృతి గీచిన చిత్రం ప్రత్యేకంగా నిలిచింది. ఆమె సాధించిన అసాధారణ విజయానికి గుర్తింపుగా 12-15 సంవత్సరాల వయస్సు విభాగంలో 3000 యూ ఎస్ డీ ప్రైజ్ మనీని గెలుచుకుంది. ఆమె విశాఖపట్నంలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థిని. 16వ టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్ కోసం అధికారిక అవార్డు ప్రదానోత్సవం బెంగళూరు సమీపంలోని బిడాడిలోని టీ కే ఎం ప్లాంట్‌లో జరిగింది. టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్

కాంటెస్ట్ ను జపాన్‌లో టొయోటా మోటార్ కార్పొరేషన్ నిర్వహించిందని, ఇది 15 సంవత్సరాల వయస్సులోపు పిల్లలను వారి డ్రీమ్ కార్లను గీయడం ద్వారా వారి ఊహ మరియు సృజనాత్మకతను ప్రదర్శించడానికి ప్రోత్సహించే అంతర్జాతీయ కార్యక్రమం అని టొయోటా కిర్లోస్కర్ మోటార్ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ తెలిపారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

విశాలాంధ్ర - అనంతగిరి: తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం నాడు అనంతగిరిలో దీక్ష కార్యక్రమం చేపట్టారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ్ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న తెలుగుదేశం కుటుంబ సభ్యులు తో దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మచ్చలేని నాయకుడని అలాంటిది స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఆధారాలు లేకుండా అరెస్టు చేయడం దారుణమైన విషయమన్నారు. ప్రతిపక్ష నాయకులను కోర్టు కేసులతో భయభ్రాంతులను చేయాలని ఉద్దేశంతో ఈ విధమైన కేసులు పెడుతున్నారన్నారు. ఏ విధంగా బెదిరించిన బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు మారుతుంటాయి కానీ అధికారులు మారని ఈ విషయం అధికారులు ఆచితూచి అడుగు

వేయాలని కోరారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వం అనే ముఖ్యమంత్రి కి అర్థమైందని అందుకే ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఈ విషయాలు ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూర్జ లక్ష్మి మండల పార్టీ అధ్యక్షులు బుజ్జిబాబు, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు అప్పారావు, సర్పంచ్ అప్పారావు, నాయకులు దోన్ను, నిర్మల, కొండమ్మ, రంజిత్, లక్ష్మణ్ శ్యామ్, శ్యామ్, జోగులు, పుష్పానందం, మాజీ సర్పంచ్ దేవుడు బీమ్ పోల్ మాజీ సర్పంచ్ శివ జనసేన నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో బంటుపల్లి వారి గ్రామపం చాయతీ పరిధిలో ఉన్న దొంతల, బంటు పల్లి వారి కల్లాలు యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిమజ్జన కార్యక్రమంలో భాగంగా సుమారు 1300 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ధూప దీప నైవేద్యాలతో స్వామివారిని పూజించి నిమజ్జన సందర్భంగా మంగళ వాయిద్యాలు, కోలాటం, చిరతలు మొదలగు సంస్కృతిక కార్యక్రమాలతో శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక స్వామిని అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జనోత్సవం చేశారు.

భారీ అన్నసమారాధన

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలో గల పాత ఎంఆర్ఓ ఆఫీస్ కాలనీ వద్ద ఏర్పాటుచేసిన సిద్ధి వినాయక మండపం వద్ద సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గణనాధునికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు మండలంలోని రాజుపేట కాలనీ గ్రామములో వెలసి ఉన్న శ్రీ

లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయము దగ్గర ఏర్పాటుచేసిన విగ్నేశ్వరస్వామి మండపము వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుండి మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామ ప్రజలు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి తరించారు.

ఎటపాక : ఎటపాక మండలం గన్నవరం లోని విక్రమార్క యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని పందిరి వద్ద సోమవారం అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ముందుగా అన్న దాన దాతలు పూస బంగారు బాబు, అలేఖ్య దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్న దాన దాతలు కుటుంబ సభ్యులు పూస రాఘవలు, వెంకటమ్మ, సత్యం నారాయణ, స్వర్ణ లత, మనోహర్, వైష్ణవి లు అన్న దానం చేశారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు కాసులు, తేజ, శ్రీకాంత్, అశోక్, సంతోష్, శివ ప్రసాద్, మోరళి, ఆకాష్, ప్రవీణ్, పి. ప్రవీణ్, ఫ్రూటి, పవన్, వై. ప్రశాంత్,నవదీప్, ధర్మ తేజ, సాయి తేజ, తదితరులు పాల్గొన్నారు.

ఆజాదీ కా అమృత మహొత్సవం

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మారేడుమిల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సత్యవేణి ఆధ్వర్యంలో ఆజాది క అమృత మహోత్సవం భాగంగా మన మట్టి మన దేశం అంటూ నినాదాలు చేస్తూ మారేడుమిల్లి గ్రామంలో విద్యార్థులతో ప్రతిభ బేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ వసతి గృహాలలో ఆరోగ్య సహాయకులను నియమించాలి

విశాలాంధ్ర - జీ కే వీధి : - ఆశ్రమ వసతి గృహాలలో తక్షణమే ఆరోగ్య సహాయకులను నియమించి విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వనుగు త్రినాథ్ అన్నారు. సోమవారం ఆయన చింతపల్లి మండలంలోని లోతుగెడ్డ గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చనిపోతే మాకేంటన్న పద్ధతిలో అధికారులు, ప్రభుత్వం వ్యవహరిస్తుందని గత విద్యా సంవత్సరం నుండి ఈ విద్యా సంవత్సరం వరకు సుమారు 20 మందికి పైగా విద్యార్థులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆశ్రమ వసతి గృహ పాఠశాలలో ఆరోగ్య సహాయకులను నియమించాలని అన్నారు. ఇటీవల విశాఖపట్నం మారికవలస గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న తెరవాడ చంద్ర కిరణ్ మరణానికి పాఠశాల యాజమాన్య నిర్లక్ష్యమే కారణమన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మారికవలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి ఆరోగ్యం బాగోలేకపోతే సకాలంలో వైద్య సేవలు అందించకపోగా, పరిస్థితి విసమించిన తరువాత తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారని, విషమ పరిస్థితిలో ఉన్న విద్యార్థిని గాయత్రి ఆసుపత్రిలో చేర్పించడంతో వైద్య సేవలు పొందుతూ ఈ నెల 21న నోటి నుండి

ముక్కు నుండి రక్తం కక్కుతూ విద్యార్థి మృతి చెందిన పరిస్థితి చూస్తే ఎవరికైనా హృదయం ద్రవించకమానదన్నారు. ఇంతటి దుస్థితికి కారణమైన ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేయాలన్నారు. మృతి చెందిన తెరవాడ చంద్ర కిరణ్ కుటుంబానికి 10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని, వారి కుటుంబానికి ప్రభుత్వం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ఒక్కొక్కరుగా మరణిస్తూ ఉంటే అధికారులు, ప్రభుత్వం చోద్యం చూస్తూ ఉండడం, నామమాత్రంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం మానుకొని శాశ్వత పరిష్కారం చూడాలని కోరారు. లేనిపక్షంలో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులందరినీ ఐక్యం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం టిఎన్ఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకు చేరిన విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ బైక్ యాత్ర

విశాలాంధ్ర - అరకులోయ: స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కొరకు సీపీఎం పార్టీ చేపట్టిన బైక్ యాత్ర సోమవారం అరకులోయ కు చేరుకుంది. ఈసందర్భంగా దండకారణ్య కళాశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి ముఖ్య అతిథి సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రమాదేవి, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.లోకనాథం మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం యువతి యువకులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం మనకు పరిపాలిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్ ను అదాని అంబానీ లకు అమ్మివేయాలని చేస్తున్న కుట్ర సాగనివ్వమని ఈ సందర్భంగా అన్నారు. విశాఖపట్నం కి ఆర్థిక కేంద్రమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు ఉపాధిగా ఉన్న స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం చేసి ఉపాధి రహిత విశాఖ చేయాలనే కుట్రలను బట్టబయలు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుండి సాగుతున్న ఉక్కు రక్షణ యాత్ర సాగుతుంది. వచ్చేనెల 5వ తేదీన విశాఖపట్నం బహిరంగ సభతో ముగుస్తుందని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ రాష్ట్రంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి పరిపాలన కాలంలో విశాఖ స్టీల్ ప్లాంట్ తో పాటు ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, రవాణా, రక్షణ రంగాలన్నీ కూడాను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చేస్తున్న కుట్రలపై మరో స్వతంత్ర పోరాటం చేయవలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. జాతీయ సంపదను కాపాడవలసిన ప్రభుత్వాలు రక్షించకుండా బక్షించడానికి చూస్తున్న ప్రభుత్వాలకు ప్రభుత్వాలకు సహకరిస్తున్న ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీల వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఓట్ల కోసం బహిరంగ ప్రచారం ఒకటి అధికారంలో వచ్చిన తర్వాత చేసేది ఒకటి గా కనిపిస్తుంది. అందులో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు విద్యా, వైద్యం వ్యాపారానికి సన్నతమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి మన రాష్ట్రంలో ప్రతిపక్షమైన తెలుగుదేశం ప్రశ్నిస్తానన్న జనసేన నరేంద్ర మోడీ కాళ్లు మొక్కుతూ ముఖ్యమంత్రి

పదవి కోసం పూటకో ఒక మాట మారుస్తూ రాష్ట్ర ప్రజల్ని మోసం చేస్తున్నారు. ఆనాడు స్టీల్ ప్లాంట్ సాధన కోసం సిపిఎం పార్టీ ఎమ్మెల్యేలు మంత్రులు రాజీనామా చేసి 32 మంది ప్రాణ త్యాగానికి వారి కుటుంబానికి అండగా ఉంటూ ఉక్కు సాధనా కోసం నిలబడి సాధించుకున్నారు. ప్రస్తుతం వాటిని అమ్మాలని చూస్తే సహించేది లేదని అన్నారు. ఉక్కు రక్షణ యాత్ర నాయకులు బి. జగన్, తిరుపతిరావు, భాస్కరరావు, పద్మ, సత్యనారాయణ, మన్మధరావు, రామ్మోహన్రావు, కృష్ణారావు ,సోమన్న, అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స డి గంగరాజు వి ఉమామహేశ్వరరావు ఎస్పీ పోతురాజు కే సురేంద్ర కె రామారావు పి. రామన్న, పి. నాని బాబు, జి చిన్నబాబు, పి. బాలదేవ్ ,కే. బుజ్జిబాబు కే. అప్పన్న జి. బుజ్జిబాబు వి.వి. జయ కే. మగ్గన్న కే .జగనాదం సహదేవ్ పి జోషి కే .ధనలక్ష్మి, ఐసుబాబు తదితరులు పాల్గొన్నారు.